క్లుప్తంగా

హైస్కూల్‌కు కుర్చీల వితరణ



కుర్చీలు వితరణ చేస్తున్న వాసుదేవ ప్రసాద్

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూల్లో గతంలో హెచ్‌ఎంగా పనిచేసిన వాసుదేవ ప్రసాద్ రూ.10 వేల విలువచేసే కుర్చీలను స్కూలుకు వితరణ చేశారు. సోమవారం వాటిని ప్రస్తుత హెచ్‌ఎం నందకుమార్‌కు అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, స్కూలు అభివృద్ధికి వాసుదేవ ప్రసాద్ ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. పీఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

మహిళలకే ప్రాధాన్యత



మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈఓ సాయిలీల

బైరెడ్డిపల్లె: రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని విశ్రాంత ఎంఈఓ సాయిలీల పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తల్లితండ్రుల ప్రోత్సాహం అవసరమన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే విజయం వరిస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణశ్రీ, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వెలుగు సమైఖ్య సీసీ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి జాతర



శివపార్వతుల ఉత్సవమూర్తులు

గుడుపల్లె: మండలంలోని అగరంలో సోమవారం శ్రీ దుర్గాదేవి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. శివ పార్వతుల కల్యాణోత్సవం అనంతరం రాత్రి దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి అమ్మవారి ఎదుట పచ్చిగెరిగె నిర్వహించారు. అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులు విశేషంగా వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లె: తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు వంటి పౌష్టికాహారం తినడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. మహతి ఫౌండేషన్ సహకారంతో గర్భవతులకు సోమవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాలు, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. కుటుంబ నియంత్రణ, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రమోహన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



చంద్రమోహన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న తంగవేలు, డీన్ స్వామి

పుంగనూరు: స్థానిక రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి డైరెక్టర్ సి.చంద్రమోహన్‌రెడ్డి విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా జెనీవాకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ (బెంగళూరు శాఖ) ఆయనకు వర్సిటీ చైర్మన్ తంగవేలు చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. బెంగళూరులో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీన్ టీఎస్.స్వామి, నేషనల్ బీజేపీ అడ్వైజర్ డాక్టర్ ఎస్.సేతు, లీగల్‌సెల్ కన్వీనర్ జైప్రదీప్, మేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

గరుడసేవకు తరలిరండి

పుంగనూరు: పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించనున్న గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని హిందూ ధార్మిక సంస్థల సభ్యులతో పట్టణంలోని తూర్పు మొగశాల వద్ద శ్రీచాముండేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో గరుడ సేవ ఊరేగింపు చేసి, ఆలయానికి చేరుకోనున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా కృత్రిమ ఇసుక తయారీ



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కృత్రిమ ఇసుక



ఇసుక తయారీకి ఏర్పాటు చేసుకున్న బెడ్డు

కుప్పం మండలంలో యథేచ్ఛగా కృత్రిమ ఇసుక తయారీ సాగుతోంది. వరమనూరు గ్రామ పరిసరాల్లో అయితే అక్రమార్కులు ఏకంగా హంద్రీ–నీవా కాలువ నీటితో ఇసుక శుద్ధి చేస్తున్నారు. మామూలు ఇసుకకు, కృత్రిమ ఇసుకకు తేడా తెలియక గృహ నిర్మాణదారులు మోసపోతున్నారు. ఈ దందా పెద్ద ఎత్తున జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

–కుప్పం రూరల్

- పుట్టగొడుగుల్లా తయారీ కేంద్రాలు
- హంద్రీ–నీవా కాలువ నీటితో ఇసుక శుద్ధి
- కృత్రిమ ఇసుకతో మోసపోతున్న గృహనిర్మాణదారులు

భారీ ఎత్తున ఇసుక తయారీ

కుప్పం మండల పరిధిలో గ్రామగ్రామాన కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలు వెలిశాయి. ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే కృత్రిమ ఇసుక తయారీపై నిషేధం విధించినా పట్టించుకోని అక్రమార్కులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఇసుక తయారీ కేంద్రాలను నడుపుతున్నారు. అసలైన ఇసుకకు డిమాండ్ అధికం కావడంతో కొంత మంది వ్యాపారులు ఈ కృత్రియ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నీటి తీరువా ఉన్న ప్రాంతాల్లో చెరువుల నుంచి మట్టిని తరలించి అక్కడ ప్రత్యేక ఏర్పాటు చేసుకున్న బెడ్లలో కడిగి విక్రయాలు చేపడుతున్నారు. ఒక్కో బెడ్డులో 6 నుంచి 10 లోడ్ల ఇసుక తయారు చేస్తుంటారు. ఒక్కో లోడు 2 వేల నుంచి 2500 రూపాయల వరకు పలుకుతోంది. దీంతో ఒక్క బెడ్డు కడిగితే ఖర్చులు పోను 10 వేల వరకు మిగులుతోంది. ఈ ఆదాయాన్ని చూసుకుని నీటి తీరువా ఉన్న ప్రాంతాల్లో రోజుకో కృత్రిమ ఇసుక తయారీ కేంద్రం వెలుస్తోంది.

హంద్రీ–నీవా నీటితో ఇసుక శుద్ధి

వరమనూరు గ్రామ పరిసరాల్లో అయితే హంద్రీ–నీవా కాలువలో అక్కడక్కడా నీటి నిలువ ఉంటుంది. ఈ నీటికి మోటార్లు బిగించి ఇసుక తయారీ చేపడుతున్నారు. పదుల సంఖ్యలో కాలువపై ఇసుక శుద్ధి చేస్తున్నా క్షేత్రస్థాయిలోని అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఉచితంగా లభించే వ్యవసాయ విద్యుత్‌తో ఈ తతంగం పెద్ద ఎత్తున నడుస్తున్నా రెస్కో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సంస్థకు పెద్ద గండి పడుతోంది.

పట్టించుకోని అధికారులు

యథేచ్ఛగా కృత్రిమ ఇసుక తయారీ జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్న వారిలో కూటమి నాయకులు పెద్ద మొత్తంలో ఉండడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. చిన్నాచితక ఎవరైనా దొరికితే నామమాత్రపు కేసులు పెడుతున్నారు. కృత్రిమ ఇసుకతో నిర్మించిన నిర్మాణాలు మన్నిక రావని ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే నిషేధం విధించినా కుప్పంలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు కృత్రిమ ఇసుక అక్రమ తయారీదారులపై చర్యలు తీసుకోవాలని కుప్పం ప్రజానీకం కోరుతోంది.

యువత పోరు విజయవంతం చేయాలి

పెద్దపంజాణి: ఈ నెల 12వ తేది బుధవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ బాగా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, విద్యార్థి విభాగం నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీమలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద శ్రీమలాలమ్మ (చాముండేశ్వరి)అమ్మవారి ఆలయంలో సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, దుర్గా హోమాలతో అమ్మవారికి పూజార్చనలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ చంద్రప్ప దంపతులు, మునస్వామి, శ్రీనివాసులు, రామచంద్ర, వెంకటరమణ, వెంకటేష్, నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులు వేసవి జాగ్రత్తలు పాటించాలి



పీహెచ్‌సీలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గర్భవతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రధానంగా ఎండకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత రెండు గంటల వరకు ఎడమ చేతి వైపు తిరిగి పడుకోవాలన్నారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల: ఆదర్శ పాఠశాలలో ఆరవ తగరతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి కోరారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన దీనికి సంబంధించి కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ,ఎస్టీలకు రూ.75 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. ఆదర్శ పాఠశాలలోనే ఐదవ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలలో పరీక్షలు ఉంటాయని, ఏప్రిల్ 20న రాత పరీక్ష నిర్వహిస్తామని, అదే నెల 27న మెరిట్ జాబితా విడుదల చేస్తామని అన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరళ, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, షో రెడ్డెప్ప ఆచ్చారి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



సామగ్రి అందజేస్తున్న యోగానంద కుటుంబ సభ్యులు

చౌడేపల్లె: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో సోమవారం యల్లంపల్లెకు చెందిన విశ్రాంత ఎస్‌ఐ నరసింహులు స్మారకార్థం ఆయన కుమారుడు, సీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రేగంటి యోగానంద కుటుంబ సభ్యులతో కలిసి 80మంది విద్యార్థులకు ప్యాడ్లు, జామిట్రీ బాక్స్, పెద్దస్కేలు, పెన్నులు మొదలైనవి పంపిణీ చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీ రమాభాయి మహిళా సంఘం తరపున నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. రేగంటి యర్రమ్మ, జ్యోతి, తేజ్ కార్తీక్, యోగ్ నిఖిల్, దీక్షిత్, వార్డెన్ బి.సురేష్ పాల్గొన్నారు.

వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ముఖ్యం



పోస్టర్లను చూపుతున్న విద్యార్థులు

పుంగనూరు: ప్రతి రోజూ వినియోగించే వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్.రమ అన్నారు. సోమవారం మోడల్ స్కూల్‌లో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ నాణ్యత ప్రమాణాల ఆధ్వర్యంలో పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మార్కెట్‌లో విక్రయించే వస్తువుల నాణ్యతను గుర్తించి, ఏది నకిలీ, ఏది నాణ్యత కలిగిందో నిర్ణయించుకునేలా ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, స్టాండర్డ్స్ క్లబ్‌మెంటర్ ధర్మేంద్ర, ఉపాధ్యాయులు మునీంద్ర, పుల్లయ్య, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం గొప్పది



షణ్ముగం దంపతులను సన్మానిస్తున్న టీచర్లు

వి.కోట: పాఠశాల అభివృద్ధికి దాతలు ఇస్తున్న సహకారం చాలా గొప్పదని గంధారమాకులపల్లె పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండలంలోని గంధారమాకులపల్లె పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుడు షణ్ముగం సహకారంతో రూ.5లక్షలతో నూతనంగా నిర్మించిన పాఠశాల స్టేజిని ప్రారంభించారు. అలాగే పదవ తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తమ ఫలితాలను సాధించిన పూర్వ విద్యార్థులకు గ్రామానికి చెందిన మునిరాజ్ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం షణ్ముగం దంపతులను టీచర్లు ఘనంగా సన్మానించారు.

యువత పోరుతో ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



పోస్టర్లను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

కుప్పం: కక్ష సాధింపుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసి విద్యార్థుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. 'యువతపోరు'ను జయప్రదం చేయాలని సోమవారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడం వల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువులు మధ్యలో ఆపివేయాల్సిన పరిస్థితి రాష్ట్రంలో కలిగిందన్నారు. అంతేకాకుండా ఫీజులు కట్టే స్థోమత లేక విద్యార్థులు పొలాలు, కూలీ పనుల బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగు రేఖలు నింపితే, చంద్రబాబు 2014–19 మధ్యలో ఈ పథకాన్ని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి విద్యార్థులను ఇబ్బందులపాల్జేశారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పునరుద్ధరించి ఉన్నత విద్యకు బాటలు వేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ విద్యార్థుల భవితతో చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. 'యువత పోరు'తో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ కన్వీనర్ హఫీజ్, రామకుప్పం కన్వీనర్ బాబురెడ్డి, మోహన్ నాయక్, భాస్కర్ నాయక్, మునిరాజ్, భాగ్యరాజ్, విజయ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

సదుం: మండల కేంద్రంలో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురించిన కథనంపై బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులుస్పందించారు. మధ్యాహ్నానికి మరమ్మతులు చేసి సిగ్నల్స్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.

కల్పవృక్ష వాహనంపై విహారం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద నిర్వహించిన శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనంపై శ్రీవారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు పర్యవేక్షించారు.

వేలం వాయిదా

సదుం: స్థానిక మేజర్ పంచాయతీ వనరుల వేలం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం ప్రారంభించారు. వారపు సంతకు వేలం నిర్వహిస్తున్న సమయంలో కొందరు అడ్డుతగలడంతో గందరగోళం నెలకొంది. దీంతో వేలం వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలి



సింహ గర్జన పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దపంజాణి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న తిరుపతిలో నిర్వహించే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మండల మాల మహానాడు అధ్యక్షుడు మంజునాథ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలసి ఆయన సింహ గర్జన పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. పెద్ద ఎత్తున మాలలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ అధ్యక్షుడు కెళవాతి సుబ్రమణ్యం, ప్రచార కార్యదర్శి తిప్పన్న, నాయకులు రంగప్ప, బొమ్మలకుంట రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పెద్దపంజాణి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. ఆమె కథనం మేరకు.. పెద్దపంజాణి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

పలమనేరు సమస్యలను పరిష్కరించరూ!

- సీఎంకు ఎమ్మెల్యే వినతి



సమస్యలను సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా కలిసి కోరినట్టు తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గంగన శిరస్సు, కైగల్ ఎత్తిపోతల, క్యాటిల్‌ఫామ్ వద్ద ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్ కావాల్సి ఉందని సీఎంకు నివేదించామని, అలాగే తాము గుర్తించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలియజేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

పుంగనూరు: అంగన్‌వాడీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించలేదని నిరసన వ్యక్తం చేస్తూ ఐఎఫ్‌టీయూ నేతలు సోమవారం మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ధర్నా చేశారు. సంఘ నాయకురాలు మల్లీశ్వరి, ప్రేమకుమారి దీనికి నేతృత్వం వహించారు. వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించని పక్షంలో ప్రభుత్వ సాధికారిత సర్వే నుంచి ప్రభుత్వ ఉద్యోగి అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు అందజేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలతో ధర్నాకు పిలుపునిస్తున్న పంచాయతీ కార్మికులు

వి.కోట: పంచాయతీ కార్మికుల సమస్యలపై విజయవాడలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఈ నెల 17న చేయ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని వి.కోట పంచాయతీ కార్మికులు కోరారు. సోమవారం మండల ప్రధాన సచివాలయం వద్ద పంచాయతీ కార్మికులు డిమాండ్ల కరపత్రాలను చేతపట్టుకుని పిలుపు నిచ్చారు. వారు మాట్లాడుతూ, అక్రమంగా తొలగించిన పంచాయతీ కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, 1999లో జారీచేసిన జీఓ ఎంఎస్ నంబర్ 551 ప్రకారం కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సునీల్ కుమార్ సస్పెన్షన్‌పై నిరసన



సునీల్‌కుమార్ సస్పెన్షన్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన సేన నాయకులు

కుప్పం: సీనియర్ ఐఏఎస్ అధికారి సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై బహుజన సేన పార్టీ నిరసన వ్యక్తం చేసింది. అనుమతి లేకుండా సునీల్ కుమార్ విదేశాలకు వెళ్లాడనే నెపంతో ఇలా చేయడం తగదని ఆ సేన రాష్ట్ర అధ్యక్షులు చందు అన్నారు. సునీల్ కుమార్ సొంత ఖర్చులతో అమెరికాలోని తన కుమారుడిని చూసేందుకు వెళ్లారని, కక్షపూరితంగా ఆయన్ను సస్పెండ్ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు పోస్టింగులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా అవమానిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సతీష్, రవి, కుమార్, తిమ్మరాయప్ప పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీ రుక్మిణీ సమేత సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ప్రాణ ప్రతిష్ఠ, నాడీ సంధానం, నేత్రోన్మీలనం, కళాహోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, మహా మంగళహారతి పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు.



హాజరైన భక్తులు